# వనజ ★

★ రచయిత : శ్రీమతి యస్. క్రిష్ణవేణి

నిన్న నా ముండతో మనవాడు సినీమాకు వెళ్లడం చాలామంది చూసేరటండీ.

ఏముండతోనే?

ఏముండేమిటి? ఇంక ఎవరు ఈ వూరిలో వున్నట్టు. మేష్టరమ్మ చెల్లెలు వనజలేదూ దానితోనేనటండి.

మనవాడే?

మనవాడు కాకపోతే వూరివాడెవడో వెళితే నాకెందుకండీ. అందుకే యీ ప్రబుద్ధుడు పెళ్ళివద్దు అంటున్నాడు. ఇక్కడే మనకళ్ల ఎదుటే యిలా ప్రవర్తిస్తున్నాడుకదా, ఆ దూరదేశంలో యింకెలా వెలిగిస్తున్నాడో !

అప్పుడే బజారునుండి యింటికి వచ్చిన నా చెవిలో అమ్మమాటలు పడ్డాయి. వచ్చినత్రోవనే బయటకు వచ్చి వరండాలో కూచున్నాను. నిన్న సాయింత్రం జరిగిన సంఘటనలు నా కళ్ళకు కట్టినట్లున్నాయి. సాయింత్రం నాలుగయింది. ఉబుసుపోక సినీమాకైనా వెళ్ళితే బాగుంటుందనిపించింది. అమ్మతోచెప్పి బయలుదేరేను.

మా వూరికి ఓ మైలు దూరంలో ఓ టెంటుసినీమా నడుస్తోంది. అంత దూరం వెళ్ళటం ఇష్టంలేకపోయినా బయలుదేరేను. రెండుఫర్లాంగులు వెళ్లేసరికి వనజ యింకో అమ్మాయి తోడుగా వెళుతుండడం చూచా. నాలుగు అడుగులు తొందరగావేసి వాళ్లతో మాట్లాడుకుంటూ వెళ్ళేను. వాళ్లుకూడా సినీమాకు వెళ్తుండడంవలన అంతా ఏదో లోకాభిరామాయణం మాట్లాడుకొంటూ వెళ్ళి తిరిగి సినీమా అయిన తర్వాత యింటికి వచ్చేశాం. నేను సినీమాకు వెళ్లడం తిరిగిరావడం అదేపని కట్టుకొని కృష్ణుడు కనిపెట్టేడు. బహుశా వాడే అమ్మతో చెప్పివుంటాడనుకున్నా. జరిగినదంతా కాకతాళీయం. ఇంతలో నాన్న తాంబూలంనముల్తు బయటకు వచ్చేరు.

ఒరేయ్ పెద్దా (నాకు పెద్దఅని పేరు) నడురా అలా పొలాలతట్టు వెళ్లివద్దాం అన్నారు.

పదండి నాన్నగారూ! అని నేను బయిలుదేరేను దారిలో నాన్నగారు ఒరేయ్! ఈ యేడాది నీకు పెళ్లిచేశీయాలనుకుంటున్నానురా అన్నారు. ఆయన తరహాయే వేరు. ఏదైనా చెప్పాలంటే సూటిగా చెప్పేస్తారు.

నేను వూరుకున్నాను.

"అయితే నీకిషమే నన్నమాట"

ఇష్టమనడానికి జంకుతున్నా. అయిష్టమనడానికి ధైర్యం చాలదు. మంచి సందిగ్ధంలో పడ్డాను. ఎలాగో మనసు నిలదీసుకొని "ఇప్పుడెందుకులెండి తొందర" అన్నాను.

"తొందరకాబట్టే! లేకుంటే వెధవ్వి అమ్మాయిల వెంటపడుతున్నావట?" అన్న మాటలు చిరునవ్వు సందునుండి దొర్లించేరు.

అది కాకతాళీయంగా జరిగిన సంఘటనండీ.

ఏదిరా?

వనజతో నిన్న సినీమాకు వెళ్ళటం గురించేనండి."

అయితే అంతా విన్నావన్నమాట. సరే మీ అమ్మతో ఆలోచించి తొందరలో ముహూర్తం పెట్టించాలి.

ఇంటికి చేరేవరకు మా మధ్యను మరేమాటలు లేవు. నేను ఒక్కణ్ణే సంతానం. బోలెడంత ఆస్తివుంది. గాని నాకు దూరదేశాలకుపోయి కొంతకాలం వుద్యోగం వెలిగించాలని బుద్ధిపుట్టింది. చదువుంది కాబట్టి ఓ ఖాళీవస్తే దరఖాస్తు రాసిపారేశాను. అదే తన్నుకు వచ్చింది. ఉద్యోగ సందర్భంలో విదేశాలలో ట్రయింగుకని రెండేండ్లు పంపించేరు. బాండుప్రకారం వాళ్లకు ఆరు సంవత్సరాలు సర్వీసు యివ్వాలి. ఇంకో రెండేండ్లున్నాయి మా బాండు గడువు. గడువు దాటితే యింటికివచ్చి పొలంపుట్రా చూసుకుందామనుకుంటున్నాను.

ఇంటి వరండాలో కాలుపెడుతూ "నీ ప్రయాణం ఎప్పుడు?" అన్నారు.

ఇంకా వారంవుంది 28-వ తారీఖున బయలుదేరుతా" నన్నాను.

మర్నాడు ఆదివారం. నేను చల్లగా గ్రంథాలయానికెళ్ళేను. సాధారణంగా ఎవరూరారు. హాలులోనికి వెళ్ళేను. ఎవ్వరూలేరు. పెరట చిన్న పూలతోట వుంది. పూలతోటచుట్టూ చిన్న కంచె వుంది. కంచెకు ఆవల స్కూలు. స్కూలుకు తగిలే మేష్టరమ్మగారి యిల్లు. పూలతోటకు వెళ్ళేసరికి వనజ జ్ఞాపకం వచ్చింది. మేష్టరమ్మగారి యింటికి వెళ్ళేను.

మేష్టరమ్మ మంగళ బయిటకుర్చీలో కూర్చొని పేపరు చదువుతోంది. చూడ్డానిక ముచ్చటగా వుంటుంది. వయస్సు ముప్పై పైబడ్డదని ఆమె చెప్పినా ఎవ్వరూ నమ్మరు. పిల్లలు వున్నట్టులేరు. మెడలో మంగళసూత్రం వుంది కాబట్టి వితంతువుకాదని తెలుసుకున్నా. నేనువెళ్లడం గమనించింది. 'ఎవరది' అన్నట్టు చూసి నాయుడుగారబ్బాయా! రండి! కూచోండి అని ఎదురుగావున్న కుర్చీ చూపించింది.

నేను కూచున్నాను. వంటయింటినుండిగాబోలు వనజ గాజులాడించింది.

ఆ శబ్దంలోనే వనజ విగ్రహాన్ని పూర్తిగా చూడగలిగేను. వయసులో ఉన్న చక్కనిచుక్క. నిండైన విగ్రహం. కొంచెం చదువుసంస్కారం వున్నట్టుంది.

ఏం యిలావచ్చేరు. దారిగాని తప్ప లేదుకదా? అంది మంగళ.

లేదండి అన్నాను.

మంగళే నాగురించిన వివరాలడిగింది. అమెరికాలో ప్రజల జీవితాల గురించి అడిగింది. యీలోగా వనజ



మూడుకప్పుల కాఫీ పట్టుకొచ్చింది. తనూ ఓకుర్చీలోకూర్చొని కాఫీత్రాగడం ప్రారంభించింది. నా ముందుగావున్న కప్పు పుచ్చుకొని నేను త్రాగుతూ అమెరికాగురించి చెప్పుకుపోయాను. మాటల మధ్యలో "నాగురించి అంతా తెల్సుకున్నారుగాని మీవిషయం చెప్పేరు కారు" అన్నాను ఆమె మంగళసూత్రం వైపుచూస్తూ. మంగళ నేను ఆమె మంగళసూత్రం చూస్తున్నట్టు గ్రహించి తాను ఒపర్యాయం చూసుకొంది. సన్నని ఆ వేళ్లతో ఆ తాలిని కళ్లకు అద్దుకుంది.

"నాదో పెద్దకథ శేఖర్‌గారూ! చెప్తే ఎవ్వరూ నమ్మరు. మీరైనా నమ్ముతారని నేను అనుకోను" అంది.

బాగుందండోయ్ మీకథ. అబద్ధంగా చెప్పి మీరు ఆదుకొనేదేముంది.

నేను ఐదేండ్లపిల్లగా వున్నప్పుడు అమ్మ చనిపోయింది. నాన్న ఏదో వ్యాపారసంస్థలో భాగస్వామిగా వుండేవారు. అమ్మ చనిపోయిన చాలకాలం వరకు పెండ్లి చేసుకోలేదు. అతని ఆఫీసులోన ఒ స్టెన్ వుండేది. ఆ అమ్మాయిమీద అతనికి అభిమానం కలిగింది. క్రమంగా అది ప్రేమగా మారింది. ఆ స్టెన్‌నే నాన్న పెళ్లిచేసుకున్నారు. పిన్ని యింటికివచ్చేసరికి నేను ఎస్. ఎస్. ఎల్. సి. చదువుకుంటుండేదాన్ని. మావూళ్లో ఆరోజుల్లో కాలేజీ వుండేదికాదు. నాకు పట్నం చదువుకు పోవాలనిపించింది. నాన్నగారికి చెప్పేను. ఆయన అంగీకరించేరు, పిన్నికూడా ప్రోత్సహించింది. నేను యింటర్మీడియెట్ వదువుతున్నప్పుడే పిన్నికి వనజ పుట్టింది. వజన పుట్టిన యేడాదికే పిన్నికూడాపోయింది. నాన్నగారు మరి పెళ్లిచేసుకోలేదు. నేను బి.ఏ. చదువుతున్నరోజుల్లోనే ప్రసాద్ అనే ఒక గ్రాడ్యుయేటు కిచ్చి నాకు పెళ్ళిచేసేరు. నాకు ప్రేమించి పెండ్లిచేసుకోవడంలో నమ్మకంలేదు. దాంపత్యానికి కావలసింది అనుకూల వాతావరణం. ఆలిమగలమధ్య అన్యోన్యత. ఒకరినొకరు అర్థంచేసుకొని సర్దుబాటుగా కాలంగడిపే విజ్ఞత. అందుకే నేనభ్యంతరంచేయలేదు. నాకు పెండ్లి అయినా చదువు మానాలనిపించలేదు. ప్రసాద్‌కూడా అడ్డుచెప్పలేదు. అతను నాన్నగారి తరఫున వ్యాపారం చూసుకుంటుండేవారు. నేను బి. ఏ. పరీక్ష యిచ్చి యింటికివచ్చేను. వనజ యింకా నాలుగేండ్లపిల్ల. ఓరోజు హటాత్తుగా నాన్నకు హృద్రోగం వచ్చింది. మూడు రోజులు ముగియకుండానే అతన్ని ప్రకృతి తనలో లీనంచేసుకుంది.

నాన్న అనంతరం వ్యాపారం ప్రసాద్ చేతిమీదుగానే నడచింది. మాలో అన్యోన్యతకు అంతరాయంగా ఒక అమ్మాయి దాపురించింది. అది నా కర్మ అనుకున్నాను అయన్ని అనేక విధాలుగా బ్రతిమాలిచూశాను. గాని ఎల్లప్పుడు ఆమెతోనే వుండేవారు. కొంత కాలానికి వ్యాపారంలోని లాభాలు కాకుండా మాభాగంవాటాకూడా ప్రసాద్ హారతికర్పూరంలా వెలిగించినట్లు తెలిసింది. ఎవరకూ చెప్పకుండా అతను ఓరోజు పరారీ అయేరు. ఈ నాటివరకు అతనిజాడే తెలియలేదు. శ్రీమంతుల యింట్లో పుట్టి కష్టమనే దెటువంటిదో యెరుగని మేము నడివీధిలో నిలబడ వలసివచ్చింది. జీవితానికి మేష్టారు గిరీ సులభమనిపించింది. ఉన్నయిల్లు బాడుగకుయిచ్చి వనజను వెంటబెట్టు కొని నేను పట్నం వెళ్ళిపోయేను. బియిడి ప్యాసయ్యేను. మేష్టారుగా చేరేను. వనజ నాతోనేవుంది. నన్ను నేను పోషించుకుంటూ వనజను చదివించాలని నిర్ణయించేను. సాధారణ జీవితానికి కావలసిన అవసరాలకు తప్పించి యితరత్రా అన్నిఖర్చులు తగ్గించేను. వనజను బి ఎ. వరకు చదివించేను. ఇక మిగిలింది ఏ అయ్యచేతిలోనో వనజనుపెట్టి నాతండ్రి, పిన్ని నాకు వప్పచెప్పిన కర్తవ్యం ముగించాలి" అని చెప్పింది. ఆమె కనుకొలకులనుండి అశ్రువులు జారేయి.

మరియు మీరు యీగ్రామానికి.... అని నేను అడుగకపూర్వమే మంగళ ప్రారంభించింది. గత సంవత్సరమే నన్ను యిక్కడకు బదిలీ చేసేరు. అన్నది.

తర్వాత అంతా యింటిలోనికివెళ్లేం. మంగళ పడకగదిలో ప్రసాద్ ఫోటో ఒకటివుంది. అది నాకు చూపించింది. ఆ ఫోటో ఎక్కడో చూసినట్టు నాకు జ్ఞాపకం వచ్చింది.

సాయంత్రం నాన్న వాకిట కుర్చీ వేసుకొని పత్రిక చదువుకుంటున్నాడు. నేను మెల్లగా నాన్నదగ్గర కుర్చీలో కూర్చున్నాను.

పేపరు చూస్తున్న నాన్నగారు నా వైపు చూసేరు.

"ఏమిటోయ్! ఎక్కడయినా పిల్లను గాని చూసేవేమిటి" అని అడిగేరు.

"అదికాదండి" అన్నాను.

"మరైతే ఏది" అన్నారు.

"మీ పెద్దన్నయ్యకు ఓ కొడుకు వుండాలికదండీ" అన్నాను.

కదండీ ఏమిటోయ్! ఉన్నాడు ఒక లుచ్ఛా!

పేరు....

ప్రసాదరావు.

ఇప్పు డెక్కడవున్నాడండీ.

ఎక్కడేమిటి మా పాతవూరిలోనే.

అసలు యిక్కడో చిన్న కథవుంది. మాది పూర్వం యీగ్రామంకాదు. మా తాతగారికి మాగ్రామంలోను, ఈగ్రామంలోను భూములుండేవి. అతని తదనంతరం అన్నదమ్ములు యిద్దరు వేరయిపోయారు. మా నాన్నగారి భాగానికి వచ్చిన యీ గ్రామంలోని భూములను చూసుకుంటూ యిక్కడే స్థిరపడిపోయారు. తర్వాత మధ్యను ఏదో మాటపట్టింపులవలన మా పెద్దనాన్న గారికీ, మాకూ సంబంధబాంధవ్యాలు చెడిపోయేయి. నాళ్లకు మాకు రాకపోకలు ఆగిపోయాయి.

అయితే నాన్నగారు—అన్నయ్య అత్తవారేవూరండీ! అన్నాను.

ఏవూరో జ్ఞాపకంలేదు. అసలు నేను పెళ్ళికి వెళ్ళలేదు. ఎవరో పెద్ద వ్యాపారస్తుని పిల్లను చేసుకున్నాడు. ఆయన కాస్త "హరీ" అనగానే ఆ ఆస్తి కాజేసి ఆ అమ్మాయిని నట్టేట్లోదించి ఓ డేన్సరు వెంట వెలిగించేడు. అది కాస్త వీడి డబ్బంతా మంగలహారతి పట్టించింది. ప్రబుద్ధుడు దేశాలన్నీ తిరిగి మొన్ననే యింటిపట్టుచేరేడని వినికిడి.

ఆపిల్లోమరి? అన్నా.

చదువుకున్నపిల్ల—ఏమైందో పాపం అన్నారు. అతని మొఖంలో విచారం స్పష్టంగా కనిపించింది.

కొంచెం వస్తారా! అన్నా.

ఎక్కడకు అని కుర్చీనుంచి లేచారు. ఎక్కడకో చెప్పకుండా నాన్నగారిని మంగళయింటికి తీసుకువెళ్లేను. మంత్రముగ్ధునిలా అతను నావెంట మంగల పడకగదికి వచ్చేరు. ఆక్కడ ప్రసాద్ ఫోటో చూపించేను.

చూసి ఆశ్చర్యపోయారు.

"యీ మహాశయుని భార్యవా అమ్మా నీవు" అన్నారు మంగళనుచూస్తూ.

తల దించుకుంది మంగళ. తర్వాత మంగళచెప్పిన కథ అంతా చెప్పేను.

తిన్నగా యింటికివచ్చి నాన్నగారు అమ్మతో ఏదో రహస్యంగా మాట్లాడేరు. తర్వాత నౌకరు రంగడిని పిలిచి ఆ రాత్రిబండికే ఎక్కడికో పంపించేరు. రెండోరోజు సాయంత్రానికి అన్నయ్యను తోడ్కొని రంగడు వచ్చేడు.

భోజనాలదగ్గర కూచున్నాం. సాధారణంగా అమ్మే మాకు వడ్డించేది. ఆశ్చర్యం! ఆదినంమంగళవడ్డించింది. ప్రసాద్ అన్నయ్య మంగళముఖం చూసేడు. నీరయిపోయేడు. అదంతా కనిపెడుతున్న నాన్న "అలా గాబరా పడకోయ్ దద్దమ్మా. అదెవరో కాదు. ఆ నాడు నీవు గంగలోదించిన భార్య" అన్నారు.

తర్వాత చాలసేపటివరకు కష్టసుఖాలు మాట్లాడుకున్నాం.

"ప్రసాద్" అన్నయ్య తనతప్పుకు చాలవరకు చింతించి క్షమాపణ కోరుకున్నాడు. మేష్టరమ్మ మంగళ వదిన అయింది.

శలవులు ఆఖరు అవడంవలన ఆ దినం సాయింత్రానికే నేను బయలుదేరాలి.

ఏమండోయ్ శేఖర్‌బాబుగారూ! పట్నంలో మరేపిల్లనైనా ప్రేమించగలరు. అత్త, మామ వప్పుకున్నారు. వనజను మీకుయిచ్చి పెండ్లిచెయ్యడానికి అంది మంగళ.

అప్పుడే మెల్లగా దగ్గుకుంటూ నాన్న వచ్చేరు. "ఏమంటావ్‌వోయ్" అంటూ.

"సరే" నన్నట్టు తలవూపేను. అక్కచాటులో "వనజ" నవ్వుకొంటూ పెరటికి వెళ్ళిపోయింది. ★